



మునోత్ పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న ఫైర్ ఇంజన్స్



కాలిపోతున్న మునోత్ పరిశ్రమ

రెండు పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు

ఏర్పేడు మండలం వికృతమాల వద్ద ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్-2లోని మునోత్.. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా ఇండస్ట్రీలలో గురువారం భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం తప్పింది. అయితే ఆస్తినష్టం రూ. 80 కోట్లకు పైగా జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారుల ప్రాథమిక అంచనా.

కాలిపోయిన 'మునోత్'

- ఆరుగంటల పాటు అదుపులోకి రాని మంటలు
- రూ.60 కోట్లకుపైగా నష్టం
- షార్ట్‌సర్క్యూట్, లిథియం అయాన్ బ్యాటరీ పేలుళ్ల వల్ల ప్రమాదమా?

ఏర్పేడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలోని మునోత్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజాము 3, 4గంటల మధ్య చెలరేగిన మంటలు ఉదయం 11గంటల వరకు అదుపులోకి రాలేదు. ఈ మంటల తీవ్రత కారణంగా పరిశ్రమ మొత్తం అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో పరిశ్రమలో కార్మికులెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.65 కోట్లకుపైగా ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు. ఇక్కడ మంటలు చెలరేగి దట్టమైన పొగలు అలుముకోవడంతో సమీపంలోని డిక్సన్ పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు.. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన అధికారులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పరిశ్రమలోని స్టోర్‌రూమ్‌లోని బ్యాటరీలు పేలడం వల్లకానీ, షార్ట్‌సర్క్యూట్ వల్ల కానీ ఈ అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ మంటలను అదుపు చేయడానికి రైల్వేకోడూరు, పాకాల, నగరి, పుత్తూరు, డిక్సన్ పరిశ్రమ, శ్రీకాళహస్తి, తిరుపతి నుంచి మరో రెండు మొత్తం ఎనిమిది ఫైరింజన్లను తెప్పించారు. డీఎస్వో రమణయ్య, ఆర్ఎస్వో గోపాల్‌రెడ్డి, ఏడీఎఫ్‌వో కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. లక్ష బ్యాటరీలతో పాటుముడిసరుకులు, విలువైన యంత్రాలు కాలిపోయాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు భార్గవి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ స్థానిక వైద్యాధికారుల బృందంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

మంటలను గుర్తించిన ఆపరేటర్

మునోత్ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున సంభవించిన మంటలను ఆపరేటర్ దామోదరం మొదట గుర్తించారు. ఈ పరిశ్రమలో పగలు 120మంది వరకు పని చేస్తున్నారు. రాత్రిపూట ఇద్దరు ఆపరేటర్లు విధులకు హాజరవుతారు. బుధవారం రాత్రి విధులకు హాజరైన ఆపరేటర్ దామోదరం.. గురువారం తెల్లవారుజామున పొగతో కూడిన చిన్న మంటను ఆయన గుర్తించారు. బయటకు వచ్చి మేనేజరు శ్రీనివాసులకు సమాచారమిచ్చారు.



మునోత్ పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలు

అరబిందో ఫార్మాలో నష్టం రూ.15 కోట్లు



అరబిందో పరిశ్రమలో మంటలను అదుపుచేసేందుకు వెళ్తున్న అగ్నిమాపకశాఖ వాహనం

నాయుడుపేట/నాయుడుపేటటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా పరిశ్రమలో గ్రాన్యూలేషన్ విభాగం యూనిట్‌లో గురువారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సర్వీస్ గదిలో విద్యుత్ వైర్ల మధ్య జరిగిన రాపిడితో తొలుత చిన్నపాటి మంట చెలరేగింది. తర్వాత ప్రధాన విభాగం నుంచి మంటలు ఎగిశాయి. దట్టమైన పొగ వ్యాపించింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు అప్రమత్తమై అగ్నిమాపక సిలిండర్లతో మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి వచ్చినట్లు కార్మికులు భావించారు. అయితే అదే సమయంలో అక్కడకు కొంత దూరంలోని సప్లయ్ బాక్సులో మంటలు భారీగా చెలరేగడంతో యూనిట్ అంతటా పొగ వ్యాపించింది. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు .ఈలోగా కంపెనీ ప్రతినిధులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. నాయుడుపేట ఫైర్ స్టేషన్‌తో పాటు సమీపంలోని ఐదు వాహనాలు చేరుకుని మంటలను అదుపుచేశాయి. మంటలు సకాలంలో అదుపులోకి రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమయంలో 1400 మంది కార్మికులు పని చేస్తున్నారు. కాగా అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు రూ.15 కోట్ల వేర ఆస్తి నష్టం జరిగిందని సంస్థ సెఫ్టీ మేనేజర్ భరత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఎఫ్‌వో రమణయ్య తెలిపారు.



పొగ కమ్ముకున్న స్థలం వద్ద అగ్నిమాపకశాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులు

ముక్కంటి ఆలయ చైర్మన్‌గా సాయిప్రసాద్

సామాన్య కార్యకర్తకు పవన్ అవకాశం



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్‌తో సాయిప్రసాద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తలమండలి చైర్మన్‌గా కొట్టే సాయి ప్రసాద్ నియమితులయ్యారు.రాష్ట్రస్థాయిలో కీలకమైన ఆలయం కావడంతో చైర్మన్ స్థానం కోసం పెద్దఎత్తున పోటీ నడిచింది.టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి చాలా మంది ప్రయత్నాలు సాగించారు. అయితే అనూహ్యంగా జనసేన కోటాలో సాయిప్రసాద్‌ను చైర్మన్ పదవి వరించింది. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకుచెందిన సాయిప్రసాద్ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా వుంటూవచ్చాడు.మూడేళ్ల క్రితం వైసీపీ పాలనలో అప్పటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాడు.ఇందులో భాగంగా ఓసారి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో సీఐ అంజుయాదవ్ చెంపదెబ్బలకు గురి కావడంతో ఆ వీడియో సంచలనంగా మారింది.ఈ ఘటనతో ఒక్కసారిగా పవన్‌కల్యాణ్ దృష్టిలో పడ్డాడు.ఆయన తిరుపతికి చేరుకుని సాయిప్రసాద్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ తరువాత కూటమి గెలుపు కోసం కొణిదల విజయం- కొట్టే లక్ష్యం అనే నినాదంతో 35 వాహనాల్లో శ్రీకాళహస్తితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తన బంధు వర్గ ప్రజలను చైతన్య పరిచేలా విస్తృతంగా ప్రచారం చేశాడు.ఎన్నికల సమయంలో కూడా శ్రీకాళహస్తిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగా కృషి చేశారు. ఇక జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగిన వినుత రెండు నెలల క్రితం డ్రైవర్ రాయుడి హత్య కేసులో చిక్కుకున్నారు. దీంతో అధిష్ఠానం ఆమెను జనసేననుంచి బహిష్కరించినట్లు ప్రకటించింది. అప్పటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా, శ్రీకాళహస్తి జనసేన కీలక నేతగా సాయిప్రసాద్ మారారు.దేవాలయాల బోర్డు పదవుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని జనసేనకు కేటాయించడంతో సాయిప్రసాద్‌ను ముక్కంటి సేవా భాగ్యం వరించింది.సీఐ తనను కొట్టిన ఘటనపై నాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలబడ్డారని, ప్రస్తుతం గుర్తుపెట్టుకుని పదవి ఇచ్చిన ఘనత కూడా ఆయనకు దక్కుతుందని సాయిప్రసాద్ సంతోషం వ్యక్తం చేశాడు.ముక్కంటి భక్తులకు మెరుగైన సేవలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

8న ఎర్రచందనం ఉప ఉత్పత్తులకు గ్లోబల్ టెండర్లు

మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎర్రచందనం సెంట్రల్ గోదాములో అక్టోబరు 8న ఎర్రచందనం ఉప ఉత్పత్తుల అమ్మకానికి ఈ వేలం వేస్తున్నట్లు గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా ఆన్‌లైన్‌లో వేలందారులు అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అక్టోబరు 6న సాయంత్రం ఐదు గంటల్లోగా తనిఖీ పూర్తిచేసి డాక్యుమెంట్ అప్‌లోడ్ ముగుస్తుందన్నారు. 8వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాట ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటల్లోగా ముగుస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్ల డాక్యుమెంట్లను 'కొనుగోలు.ఏపీ.జీవోవి.ఎన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం 94409 66840, 90007 11128 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ వేలంపాటలో ఎర్రచందనం బుట్టలు 48,195 కేజీలు, హార్డ్‌వుడ్ చిప్స్ 64.856 కేజీలు, రూట్స్ 30.654 కిలోలు వేలంపాటలో ఉంచనున్నట్లు తెలిపారు.



తిరుమలలో మీనాక్షి

సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం వేకువజామున సుప్రభాతసేవలో పాల్గొని, తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



బంగారు పళ్లెం

సెగలు పొగలైన పగలు హఠాత్తుగా చల్లబడింది. కమ్ముకొచ్చిన కారుమబ్బులతో వాలుపొద్దు సూరీడు సరసాలాడాడు. సిగ్గుమొగ్గలైన ఆకాశం స్వర్ణకాంతులతో కనువిందు చేసింది. గురువారం సాయంత్రం తిరుపతి నగరంలో కినిపించిన దృశ్యం.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఆ రోడ్డు సంగతి చూడండి

నాగలాపురం- టీపీ కోట రోడ్డు అధ్వానంగా మారి 27 గ్రామాల ప్రజలు బాధలు పడుతున్నారు. ఆ మార్గంలో మూడు హైస్కూళ్లు ఉన్నాయి. విద్యార్థులు బడికి వెళ్లలేని పరిస్థితి. గతంలోనూ ఈ సమస్యను సభ దృష్టికి తీసు కొచ్చా. అలాగే, పుత్తూరు- సత్యవేడు మార్గంలో ఊత్తుకోట సమీపంలో దాసు కుప్పం వద్ద బైపాస్ రోడ్డు రోడ్డుకు ప్రతిపాదనలోని అలైన్‌మెంట్‌ను మార్చి, భూసేకరణ చేపట్టి ప్రారంభించాలి.



- అసెంబ్లీలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

యూరియా అమ్మకాల్లో వ్యాపారుల మెలిక

యూరియా కావాలంటే కాంప్లెక్సు ఎరువులను కచ్చితంగా కొనాలంటూ వ్యాపారులు మెలిక పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలి. వైసీపీ పాలనలో వచ్చిన జగనన్న కాలనీల లేఅవుట్లపై సమగ్ర విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలి. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, మండలానికి ఒకే తహసీల్దారు ఉండటం వల్ల రెవెన్యూసేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలి.



- అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రం

- తిరుమలలోని పీఏసీ-5లో ఏర్పాటు



యంత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5లో తొలిసారిగా 'రెక్లైమ్ ఏస్' ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆ యంత్రాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన ఆ సంస్థ అధినేత వివేక్ యంత్రం పనితీరును వివరించారు. ఈ యంత్రాన్ని ఇప్పటికే ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్‌లో అమర్చామని, అక్కడ పవిత్రంగా భావించే గంగలో బాటిల్ వ్యర్థాలను వేసి కాలుష్యం సృష్టించకుండా ఈ యంత్రాన్ని వినియోగిస్తున్నారన్నారు. టెట్రా ప్యాకెట్లు, స్నాక్స్ ప్యాకెట్లు వంటివి ఈ యంత్రంలో వేయవచ్చని, యూపీఐ ద్వారా లాగిన్ చేసి క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి యంత్రంలో ఉన్న రింగ్‌లో వ్యర్థాన్ని వేయాలన్నారు. వెంటనే వారికి రూ.5 బహుమతిగా లభిస్తుందన్నారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు.

పంచాయతీ కార్మికులకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, బీజేపీ నేతలు

చంద్రగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు పండ్లు, గిఫ్ట్‌లు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కాకిమాను మునిరాజ్ నేతృత్వంలో గురువారం సేవా పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, ప్రధాని మోదీ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం చంద్రగిరి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పండ్లు, గిఫ్ట్‌లను సర్పంచ్ రూపారామ్మూర్తి చేతుల మీదుగా అందజేశారు. మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దొరస్వామి, మహిళా మోర్చా నాయకురాలు ప్రశాంతి, బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, నరేష్ కుమార్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్, నాయకులు టీపీ ప్రసాద్, శశికుమార్, కిరణ్ కుమార్, చంద్రకళ, బుజ్జి, పుష్పలత, దొరస్వామి నాయుడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు దస్తావేజు లేఖరుల నిరసన



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దస్తావేజు లేఖరులు

చంద్రగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది శుక్రవారం, శనివారం పెన్ డౌన్‌తో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు గురువారం సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డికి తెలియజేశారు. ఈసందర్భంగా దస్తావేజులు లేఖర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సీఎం కేశవులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వలన దస్తావేజు తయారీ తీవ్ర జాప్యమవుతుందని చెప్పారు. దీంతో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు, దస్తావేజు లేఖరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో శుక్ర, శనివారం రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ కార్యక్రమంతో నిరసన తెలుపనున్నట్లు చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు మామండూరు సుబ్రమణ్యం నాయుడు, పాటూరు జయచంద్ర, శ్రీనివాసులు, భాస్కర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మామిడిరైతులు సస్యరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

రామచంద్రాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు చెట్ల సస్యరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉద్యాన శాఖ అధికారిణి శివకుమారి తెలిపారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగ, నడవలూరు, రాయలచెరువు, కుప్పంబాదూరు గ్రామాల్లో మామిడి చెట్ల సస్యరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మామిడి తోటల పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ ముదురు తోటల్లో కొమ్మలు బాగాపెరిగి కలిసిపోవడం వల్ల సూర్యరశ్మి సోకక చీడ పీడల బెడద పెరిగి దిగుబడులు, నాణ్యత తగ్గుతాయన్నారు. ముదురు తోటల్లో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను, ఎండు కొమ్మలను పూర్తిగా కత్తిరించి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ 1 లీటరు నీటిలో కలిపి చెట్లు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. సూర్యరశ్మి, వెలుతురు బాగా ప్రసరించేలా కత్తిరింపులు చేపట్టాలని తెలిపారు. పొలంలో ఖాళీలు ఉన్నట్లయితే 3 సంవత్సరాల వయసు గల మొక్కలను తెచ్చి ఖాళీల్లో నాటి పెంచాలన్నారు. మామిడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే రానున్న సంవత్సరం మామిడి పండ్ల దిగుబడి బాగా పెరుగుతుందన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయంలో గ్రామరెవెన్యూ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న అర్హులైన వీఆర్ఏలకు గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18, 19న తహసీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు, 20న ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన, 22న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలకు వీఆర్ఏలందరూ హాజరై విజయవంతం చేయాలని గోవిందస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్, బాలచంద్ర, గీత తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పశు సంవర్ధక శాఖతో జీవనోపాధి

చంద్రగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పశు సంవర్ధక శాఖ ద్వారా జీవనోపాధి పొంది, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆ శాఖ జిల్లా అధికారి రవికుమార్ అన్నారు. గురువారం చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలో వెలుగు సహాయ సంఘం సభ్యులతో మన డబ్బులు, మన లెక్కలు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా జీవనోపాధికి సంబంధించిన డైరీ యూనిట్లు, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి కార్యక్రమాలకు విడుదలైన నిధుల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నారావారిపల్లె పశువైద్యాధికారి వంశీ, వెలుగు సంఘ మిత్ర సాహిరాభాను, వెటర్నరీ అసిస్టెంట్లు కాంచన, విశ్వేశ్వరయ్య, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో వేడుకగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలను తీసుకొస్తున్న వేదపండితులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం పవిత్రాల సమర్పణని వేడుకగా నిర్వహించారు. వేద పండితులు యాగశాల నుంచి పవిత్రాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి మూలమూర్తిమెడలో సమర్పించారు. శ్రీదేవి, భూదేవి, మలయప్పస్వామి, పరివారదేవతామూర్తులు, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామికి, ఆలయం వెలుపల ఉన్న మహాగణపతి, మహాలక్ష్మి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి మంజుల, రఘునాథరెడ్డి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి తేజస్విని తదితరులు

భాకరాపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని భాకరాపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి తేజస్విని అన్నారు. భాకరాపేటలో కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అక్రమ లైంగిక పద్ధతులకు దూరంగా ఉండాలన్నారు. రక్తమార్పిడి చేసుకున్నప్పుడు, సిరంజీలు వాడినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ నివారణ, ఉచిత వైద్య సదుపాయం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామ్మోహన్, కోర్ సంస్థ ప్రతినిధులు తులసీ, సుభాషిణి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ కుటుంబ సభ్యులకు పరామర్శ



సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పరసారత్నం

చంద్రగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ, గడ్డంవారిపల్లెలో మృతి చెందిన డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడి కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి పరసారత్నం, టీడీపీ నాయకులు ఆర్ఎస్ చౌదరి పరామర్శించారు. సుబ్రమణ్యం నాయుడి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన చంద్రగిరి మండలానికి చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో మేడసాని కుమార్, రమణ, గాలి సతీష్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామ'లో విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న శ్రీరామ విద్యార్థులు, పక్కన చైర్మన్ రామిరెడ్డి

తిరుపతిరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, విజయశ్రీ బ్లడ్‌కేంద్రం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడమే కాకుండా మానసిక వికాసాభివృద్ధిని సాధించవచ్చన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వాసు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఏటా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తుండడం సంతోషదాయకమని అభినందించారు. సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు జి.లక్ష్మీకాంత్, ఎస్.చక్రిశ్రీధర్, బ్లడ్ కేంద్రం నిర్వాహకులు హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ టెక్నాలజీ ఏడీకి అభినందన



ఏడీ డాక్టర్ గంగరాజుని అభినందిస్తున్న బోధనేతర ఉద్యోగులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా నియమితులైన ప్రొఫెసర్ జి.గంగరాజుని గురువారం నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఉద్యోగసంఘ నాయకులతోపాటు అనుబంధ ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే దారి సమస్యకు పరిష్కారం



దారి సమస్యను పరిశీలిస్తున్న జేసీ

రామచంద్రాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే దారి సమస్యను జేసీ శుభం బన్సల్ పరిష్కరించారు. మండలంలోని సవాయికాలువ రెవెన్యూ గ్రామ లెక్కదాఖల రైతులు పొలాలకు వెళ్లే దారి సమస్యను జేసీ గురువారం పరిశీలించారు. బ్రాహ్మణకాలువ గ్రామానికి చెందిన రావిళ్ల విజయనాయుడు, మరికొంతమంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు జేసీ శుభం బన్సల్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ అరుణ్, ఆర్‌సీపురం తహసీల్దారు మధుసూదన్‌రావు, సర్వేయర్ అరుణ్, వీఆర్వో నరసింహులుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిర్యాదుదారుల పొలాలకు వెళ్లేందుకు ముందున్న భూమి సెటిల్‌మెంట్‌గా సర్వే అధికారులు గుర్తించారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న కాలువ పొరంబోకు స్థలంలో దారి ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారులను జేసీ ఆదేశించారు. దారి సమస్యను పరిష్కరించిన జేసీకి, రెవెన్యూ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండలస్థాయి క్రీడాపోటీలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కుప్పంబాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లో అండర్-14, 17 కేటగిరీల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆక్రమణలతో కుంచించుకుపోయిన

సామిరెడ్డిఒడ్డు చెరువు వంక

పాకాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ అడుసుపల్లె సమీపంలో వున్న సామిరెడ్డిఒడ్డు చెరువు వంక ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. విశాలంగా వున్న వంక మురుగు కాలువగా మారుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా పాకాల - నేంద్రగుంట రోడ్డుకు ఉత్తరం వైపు వున్న కుంట నిండి, అక్కడ నుంచి వున్న వంకలో నీళ్లు ప్రవహించి సామిరెడ్డి ఒడ్డుకు చేరుతాయి. చిన్నపాటి వర్షం కురిసినా సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీళ్లతో ఈ కుంట నిండి ఈ వంకలో పారుతాయి. పాఠశాల దక్షిణం వైపు ఫకీరుపేట గ్రామం వుంది. ఈ గ్రామం మధ్యలో వంక ఉండడంతో అక్కడనుంచి ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. రైల్వే కల్వర్టు కింద నుంచి పాకాల భారతంమిట్ట వైపు కాలువ ఉంది. వంక తూర్పు వైపు ఇరంగారిపల్లె పంచాయతీ, పడమట వైపు పాకాల పంచాయతీ పరిధిలో ఈ వంక వుండడంతో ఇరువైపులా ఆక్రమణల పాలైంది. వర్షపు నీళ్లు పారే ఈ వంక నిర్వహణను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో విశాలంగా వున్న వంక కొన్ని ప్రదేశాల్లో కాలువలా మారింది. ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగి కాలువ కనుమరుగవుతోంది. వాగు, వంకలు, చెరువులు, కుంటల పరిరక్షణకు వాల్టా చట్టం వున్నా పట్టించుకునేవారు లేక సామిరెడ్డిఒడ్డు వంక, చెరువు ఆక్రమణల పాలవుతోంది. సంబంధిత అధికారులు వంకను పరిరక్షించాలని, చెరువులో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణలు, పొదలతో నిండిపోయిన సామిరెడ్డి ఒడ్డు చెరువు వంక

కుక్కలు పిక్కలు పీకేస్తున్నాయ్..!

- వీధి శునకాలపై కొరవడిన నియంత్రణ
- ఏ ప్రాంతంలో చూసినా వందలకొద్దీ సంచారం
- భయాందోళనలో నగరవాసులు



రైల్వేకాలనీలో గుంపుగా ఉన్న కుక్కలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ ప్రాంతంలో చూసినా రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహనదారుల వెంటపడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చేపల మార్కెట్‌కు ఆనుకుని ఉన్న మధురానగర్, రైల్వే కాలనీ, అబ్బన్నకాలనీ, అశోక్‌నగర్, శ్రీదేవి కాంప్లెక్స్, సంజయ్‌గాంధీ కాలనీ, శివజ్యోతినగర్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో వీటి ఆగడాలు ఎక్కువయ్యాయి. నెల రోజుల వ్యవధిలో మధురానగర్, రైల్వేకాలనీ, అబ్బన్నకాలనీల్లో ఏడుగురు కుక్కల దాడిలో గాయపడ్డారు. ఇందులో రైల్వేకాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు ఉండటం గమనార్హం. వీధిలో ఆడుకుంటుండగా దాడి చేశాయి. దీంతో పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలు, చేపల మార్కెట్ వద్ద లభించే వ్యర్థాలు, స్థానికులు ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోడ్లపై పడేస్తుండటంతో కుక్కలు వాటిని తిని దారినపోయే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట వాహనదారుల వెంటపడుతుండటంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. పైగా చెత్తను రోడ్లపైకి ఈడ్చుకొచ్చి పడేస్తుండటంతో పారిశుధ్యం లోపిస్తోంది. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొరవడిన నియంత్రణ

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఏదైనా పెద్ద ఘటన జరిగినప్పుడు ఒకటి రెండు రోజులు కొన్ని కుక్కలను పట్టుకుని కు.ని ఆపరేషన్ చేసి, చేతులు దులుపుకుంటున్నారు. దీనిపై సంబంధిత మున్సిపల్ అధికారితో ఆంధ్రజ్యోతి మాట్లాడగా కొన్ని రోజులుగా వెటర్నరీ అధికారి అందుబాటులో లేరు.. ఇప్పుడే వచ్చారు.. ఇకపై చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. దీనిపై కమిషనర్ దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలి



డిస్కం కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్‌లోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, ఉద్యోగుల పనిభారం తగ్గించాలని జేఏసీ తిరుపతి సర్కిల్ నాయకులు దేవేంద్రరెడ్డి, టి.జయరామ్, మురళీధర్, ఎల్.చలపతి, నాగరాజు, జయమణి కోరారు. ఈ మేరకు డిస్కం కార్పొరేట్ కార్యాలయం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో కొన్నేళ్లుగా లక్షల్లో సర్వీసులు పెరిగాయన్నారు. దానికి అనుగుణంగా ఉద్యోగుల నియామకం జరుగలేదన్నారు. గత ప్రభుత్వం నియమించిన జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఆర్‌సీని సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో యూనియన్ నేతలతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు వెలగటూరు గోపి, జనార్దన్, శశి, కార్తీక్. సి.వివేణు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రాల సమర్పణ



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

వడమాలపేట, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ గావించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాల సేవ, అర్చన చేపట్టారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లకు, జయవిజయులకు, గరుడాళ్వార్‌కు, ఆంజనేయస్వామివారికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్రాల సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు, ఆలయం అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్గానిక్ వంటలు యమ్మీ.. యమ్మీ..!

- పద్మావతి వర్సిటీ హోం సైన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం



ఆర్గానిక్ వంటలు చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ హోంసైన్స్ విభాగంలో గురువారం స్టాల్ స్కేప్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. హోం సైన్స్ జర్నలిజం, ఇంగ్లీషు విభాగాల విద్యార్థినులు ఓపెన్ ఎలక్టివ్‌లో భాగంగా ఆర్గానిక్ వంటకాల తయారీ, హ్యాండ్ మేడ్ దుస్తుల తయారీ, సరదా ఆటపాటలు వంటి కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యార్థినులకు ప్రణాళిక, బడ్జెట్ తయారీ, వనరుల సమీకరణ, ప్రచారం, జట్టు పని వంటి అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టారు. ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి టీటీడీసీ భవనంలో జిల్లా పరిశ్రమల శాఖ సారథ్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు గురువారం ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ఎంఈ స్కీమ్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న అవకాశాలు వివిధ రకాల ఆర్థిక సహాయాల గురించి ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆకాంక్ష మేరకు వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడానికి సభ్యులకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటు ఇవ్వడానికి పనిచేయాలని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ లోకనాథం, జిల్లా పరిశ్రమల డీడీ రామమూర్తి, ఏపీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మా అనుభవంలోని

భూమిని కబ్జా చేశారు


తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలోని భూమిని కబ్జా చేస్తున్నారని వెంకటసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తన తండ్రి కృష్ణంరాజు 1977లో 697/2 సర్వే నంబర్‌లోని 15సెంట్ల భూమిని కొనుగోలు చేశారన్నారు. పక్కనే 15 సెంట్ల గుంట పొరంబోకు ఉండటంతో ఇన్నాళ్లుగా వ్యవసాయం కోసం 1985 వరకు వినియోగించామని తెలిపారు. సదరు స్థలాన్ని తమకు అధికారికంగా అప్పజెప్పాలని 1997లో కోర్టు ద్వారా స్టేటస్‌కో తెచ్చుకున్నామని చెప్పారు. అయితే ఎమ్మెల్యే అనుచరుల పేరుతో విజయ్‌కుమార్ అనే వ్యక్తి వచ్చి ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడని తెలిపారు. కోర్టుకు వెళ్లగా నోటీసులు జారీ చేయడంతో వెనక్కు తగ్గారని, మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇదే స్థలంలో మాకు పట్టా ఇచ్చారు

జీవకోన తిరుపతి పట్టణ లెక్కదాకల 697/2లో ఉన్న 15సెంట్ల స్థలాన్ని 1985లో తన తల్లి ఆసియాబీకి ప్రభుత్వం మంజూరు చేసిందిన ఆమె కుమారుడు మీర్జాంశ తెలిపారు. తాను చేసిన అప్పుకు బదులు ప్రభుత్వం మంజూరు చేసిన ఆ స్థలాన్ని విజయకుమార్‌కు అగ్రిమెంటు ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కాణిపాక ఆలయ చైర్మన్‌గా మణినాయుడు

- రెండోసారి అవకాశం ఇచ్చిన చంద్రబాబు



సీఎం చంద్రబాబుతో మణినాయుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయ పాలకమండలి చైర్మన్‌గా వి.సురేంద్రబాబు అలియాస్ మణినాయుడు రెండవ సారి నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదలకు ఆయన చేసిన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు రెండవసారి అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ఆలయ అభివృద్ధి కోసం మణినాయుడు కృషి చేశారు. గతంలో 8 నెలల కాలం ఆయన ఆలయ చైర్మన్‌గా పని చేశారు.ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం రావడంతో చైర్మన్ పదవిని వదులుకున్నారు.

నేడు మెగా ఉద్యోగ మేళా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంకాం, పీజీ, డీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులని ఆమె తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు సమయానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.37.98 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.37,98,411 లభించింది. దీంతోపాటు బంగారం రూ.20 గ్రాముల 850 మిల్లీ గ్రాములు, వెండి 312 గ్రాముల 200ల మిల్లీ గ్రాములు వచ్చింది. ఆలయ ఆవరణలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. 90 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో ఎ.జయకుమార్ తెలిపారు. పాలకమండలి అధ్యక్షుడు మహేష్ యాదవ్, సభ్యులు పర్యవేక్షించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలం



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం బలంగా ఉంటుందని ఈఎస్ఐ ఆస్పత్రి స్త్రీల వైద్య నిపుణురాలు పద్మావతి అన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో గురువారం మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రోగ్రాం నోడల్ అధికారి పద్మహస్త, డాక్టర్లు హేమకుమారి, కృష్ణ కిశోర్, రాధమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ అమ్ములు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్ఏసీ మైనారిటీ సెల్ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ హ్యూమన్‌రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ మైనారిటీ విభాగం రాష్ట్ర నూతన కార్యవర్గం గురువారం ఎంపికైంది. స్థానిక కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు కాణిపాకం మురళి ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్‌రఫీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్‌లను నియమించారు. నూతన కమిటీ మానవ హక్కుల గురించి తెలుసుకుని, ప్రజలకు అవగాహన కల్పించాలని మురళి సూచించారు. తమపై నమ్మకంతో పదవులు అప్పగించిన మురళికి నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కంకణాల వినోద్‌కుమార్, నగర ప్రెసిడెంట్ దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ కమిటీకి సన్మానం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నూతన కమిటీని జనసేన నగర ప్రధాన కార్యదర్శి సుమన్‌బాబు గురువారం సన్మానించారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో చైర్మన్ ఎస్.మహేష్‌యాదవ్, సభ్యులు రుద్రకిషోర్, విమల, వరలక్ష్మి, మధులత, గుణ, భాగ్యవల్లి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, శ్యామల, లక్ష్మణరావులను కలసి అభినందించారు. ఆలయాభివృద్ధికి కృషి చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాల అందేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సుధాకర్, పవన్‌కుమార్, సుమంత్ పాల్గొన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభం వద్ద శుద్ధి చేస్తున్న అధికారులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరస్వామి ఆలయం లో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేక పూజలు జరిపారు. తర్వాత గర్భాలయం, ధ్వజ స్తంభం, ఉపాలయాలు, పరిసరాలను శుద్ధి చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎ.జయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారికి రోజూ ప్రత్యేక అభిషేక పూజలు, చండీహోమం, సహస్రనామార్చన, ప్రదోష కాలంలో ఊంజల్ సేవ, దశవిధ హారతులు ఉంటాయని వివరించారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బ్రహ్మోత్సవాల్లో వసతిపై సమీక్ష

తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గదుల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి రిసెప్షన్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆయన సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి రిసెప్షన్ విభాగంతో సమీక్షించారు. విశ్రాంతి గృహాలను పరిశీలించి ఏవైనా మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, ఏఎస్వీ సత్రేనాయక్, వీఎస్వో సురేంద్ర పాల్గొన్నారు.

అనాధీన భూమి ఆక్రమణపై వివాదం



ఆక్రమిత స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని శివజ్యోతినగర్ లెక్కల దాఖలా సర్వే నెంబరు 697/2లో ఉన్న ప్రభుత్వ అనాధీన భూమిలో కొంతభాగం ఆక్రమణకు గురైంది. ఆక్రమణదారులు ఆ స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. తమకు రికార్డులు ఉన్నాయని చెబుతున్నారు. దీనిపై వైసీపీ నాయకులు ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే పీఏకు సంబంధించిన వారు ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. పక్క స్థలానికి సంబంధించిన వారు కూడా తమ స్థలం కొంత ఆక్రమణకు గురైందని చెప్పారు. రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలను స్థాపించండి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను స్థాపించాలని హైకోర్టు న్యాయవాది, బీజేపీ నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి కాలేజియేట్ కమిషనర్ నారాయణ్ భరత్‌గుప్తను కోరారు. గురువారం ఆయన అమరావతిలో భరత్‌గుప్తను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం వల్ల పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందడం లేదన్నారు. భరత్‌గుప్తాను కలిసిన వారిలో హైకోర్టు న్యాయవాది ఆర్.అభిషేక్ రెడ్డి ఉన్నారు.



తెలుగు మహిళ తిరుపతి నగర అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుతున్న రేవతి, సూర్యకుమారి, అనిత, హేమ, లక్ష్మి, మల్లిక, జాహ్నవి, టీడీపీ నేతలు

తిరుపతి

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలోని వ్యాకరణ విభాగ పరిశోధకురాలు పి.పుణ్యవతి డాక్టరేట్ పొందారు. శబ్దరత్నాకరే సంగృహీతానాం అజాదీనాం సంస్కృత తత్సమ శబ్దానాం పాణినీయ దిశా విశ్లేషణాత్మక మధ్యయనం అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత నేతలు

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ విజయభాస్కరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్, ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, అకడమిక్ కన్సల్టెంట్లు రంజిత్‌కుమార్, ప్రవీణ్, శరత్ తదితరులు శాలువాతో సత్కరించారు.

పాలిటెక్నిక్‌లో సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీని కోరారు. గురువారం ఆర్జేడీని ఆయన కార్యాల యంలో కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ విద్యార్థుల నుంచి విచ్చలవిడిగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్నారని, సరిపడినంత ఆహారం కూడా పెట్టడంలేదని ఆరోపించారు. ప్రిన్సిపాల్ నిబంధనలను ఉల్లంఘించి మైదానాన్ని లీజ్‌కు ఇస్తూ విద్యార్థులు ఆడుకోడానికి వీలులేకుండా చేస్తున్నారని చెప్పారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొలగించిన అర్బన్ ఈ-సేవ కేంద్రాల కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి మాధవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న అభ్యర్థన దీక్షలను బాధితులు జయప్రదం చేయాలని కోరారు.

అన్నార్థుల భరోసాకు ఏడాది

● తిరుపతిలో వసంతం పూర్తి చేసుకున్న అన్న క్యాంటీన్లు





తిరుపతి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చే ధైర్యానికి ఏడాది పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరిగ్గా ఇదే రోజు (19-09-2024) తిరుపతిలోని 4 అన్న క్యాంటీన్లు పునః ప్రారంభమయ్యాయి. రుచికి, శుచికి పెద్దపీట వేసేలా నగర పాలక సంస్థ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. రూ.5 చెల్లించి పేదోడు పట్టెడన్నం సగర్వంగా తింటున్నాడు.

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లకు తాళం వేసిన విషయం తెలిసిందే. తిరుపతిలోని క్యాంటీన్లను వైసీపీ నేతలకు కట్టబెట్టడం, వాటిని ఖరీదైన హోటల్స్‌గా మార్చుకోవడం జరిగిపోయింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పునః ప్రారంభమయ్యాయి. స్విమ్స్ సర్కిల్, ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన, ఎమ్మార్ పల్లి సర్కిల్ సమీపంలోని రెండింటితో పాటు నాలుగు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తున్నారు. పేదలకు, రోజువారీ కూలీలకు, కార్మికులకు ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. వారితోపాటు వివిధ పనులపై నగరానికి వచ్చే వారు అన్న క్యాంటీన్లకు వెళ్లి ఆకలి తీర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వానికి చల్లని దీవెనలు అందిస్తున్నారు.

● మాది తిరుపతి ఐఎస్ మహల్ దగ్గరే ఇల్లు. కొన్ని సమస్యల వల్ల 7 నెలలుగా అన్న క్యాంటీన్‌కు వచ్చి భోంచేస్తున్నా.



కె.శంకర్, తిరుపతి

కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం వలనే కదా మాలాంటి వాళ్లకు ఉపయోగపడింది.

● వ్యవసాయ కళాశాల ఎదురుగా విద్యానగర్‌లో కాపురం ఉంటున్నా. ఆటోడ్రైవర్‌గా నగరం అంతా తిరుగుతుంటా. భోజన సమయానికి ఇంటికి వెళ్లాలంటే ఆలస్యమవుతుంది. దీంతో దగ్గరలో ఉండే అన్న క్యాంటీన్ వెళ్లి తినేస్తుంటా. ఇంటి భోజనంలాగే ఉంటుంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.



పి.బాల, ఆటోడ్రైవర్, తిరుపతి

● స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు పీలేరు నుంచి వచ్చాం. అక్కడ ఓపీకి ఇంకా సమయం ఉండడంతో అన్న క్యాంటీన్‌లో భోజనం చేద్దామని వచ్చాం. ఆస్పత్రులకు వచ్చే వాళ్లు రూ.5కు నాణ్యమైన ఆహారంతో కడుపు నింపుకుంటున్నారు.



సలీమ, పీలేరు

● మా కుటుంబ సభ్యులు రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బయట భోజనం కన్నా అన్న క్యాంటీన్లలో బాగుంది. మూడు రోజులుగా ఇక్కడకే వచ్చి తింటున్నా. చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.



సౌందర్య, బంగారుపాళ్యం

● మరో రెండు క్యాంటీన్లకు ప్రతిపాదనలు

- మౌర్య, నగర కమిషనర్



నగరంలోని 4 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అక్షయపాత్ర ఫౌండేషన్ వారు ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారు. నాణ్యత, శుభ్రత పాటించేలా ఆదేశాలిచ్చాం. తిరుపతికి యాత్రికులు ఎక్కువ మంది వస్తుంటారు కాబట్టి మరిన్ని అన్న క్యాంటీన్ల ఏర్పాటు అవసరం ఉంది. ప్రతిపాదనలు పంపాం.

● ఏడాదిలో ఎంతమందికి ఆకలి తీర్చారు

- ఉదయం అల్పాహారం	:33804
- మధ్యాహ్న భోజనం	: 504651
- రాత్రి భోజనం	: 245902
● మొత్తం	: 1134357

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.6,400 కోట్లు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. వెంటనే చెల్లించని పక్షంలో విద్యార్థులతో కలసి పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

జిల్లాస్థాయి వ్యాస రచన, డిబేట్ పోటీలు



విజేతలతో అధికారులు, వారధి ఫౌండేషన్ నిర్వాహకులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్, పాఠశాల విద్యాశాఖ సంయుక్త నిర్వహణలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలు గురువారం స్థానిక ఎస్వీ కాంపస్ హైస్కూల్లో జరిగాయి. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరీశంకర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. వ్యాసరచన పోటీల్లో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు ధనుష్ కృష్ణ, గగన్ కృష్ణ ప్రథమస్థానంలో నిలిచారు. శ్రీకాళహస్తి మండలం బాబు అగ్రహారం మున్సిపల్ స్కూల్ విద్యార్థులు పోతనసాయి, అబ్దుల్ రెండవ స్థానం, వరదయ్యపాళెం మండలం కారిపాకం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రణతి, ముని తేజశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. డిబేట్‌లో తుమ్మలగుంట జడ్పీ హైస్కూల్ ఉద్భవరెడ్డి రవిలోచన, కీర్తేష్ ప్రథమ స్థానంలో నిలవగా మునిలోహిత జోషిత, ప్రణతి రెండవ స్థానాన్ని పొందారు. సంతవేలూరు హైస్కూల్ విద్యార్థులు భార్గవి, రేష్మ మూడో స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు అక్టోబర్ 16న వ్యాస రచన, 18న డిబేట్‌లో ఆన్‌లైన్ విధానంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు.

15నెలల్లో 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ

● ఎస్వీయూలో టీఎన్ఎస్ఎఫ్ సంబరాలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో 16 వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని టీఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్ నాయుడు, గంగాధర్ పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు నాయకుడిగా నారా లోకేశ్ యువత మనసులో బలమైన ముద్ర వేసుకున్నారని అభిప్రాయపడ్డారు. ఎస్వీ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఆర్చి వద్ద గురువారం వారు కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ టీచర్ పోస్టుల భర్తీ ద్వారా ఎంతో మంది నిరుద్యోగుల జీవితాల్లో లోకేశ్ వెలుగులు పూయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కుసుమ, రాఘవేంద్ర, అఖిల్, తరుణ్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా తిరుమలరెడ్డినగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ రాజేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరత్నం, బీజేపీ నేతలు అనిల్‌రెడ్డి, మల్లకుప్పం శేఖర్, దండు విజయ్, నవీన్, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ అవరణలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. పది రోజులపాటు నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో కార్మికులంతా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీపీఎంవో శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీఈ మధు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన సుందరరాజ్

తిరుపతి(నేర విభాగం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళతో ఆర్థిక వివాదం నేపథ్యంలో తమిళనాడుకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురు వారం తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సుందరరాజ్(33) తిరుపతిలోని ఒక వస్త్ర దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న మహిళతో పరిచయం పెంచుకుని ఆమె వద్ద కొంత అప్పు చేశాడు. ఈ విషయమై కొంతకాలంగా వారి మధ్య వివాదం నడుస్తోంది. పలుమార్లు ఘర్షణకు కూడా దిగారు. సుందర్‌రాజ్ బుధవారం మధ్యాహ్నం ఆమె ఇంటి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బెడ్ రూములో చీరతో ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి తలుపులు పగులకొట్టి కిందకు దింపి చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి మామ విజయరాజ్ గురువారం రూరల్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు

తిరుచానూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి మహిళ సాధికారత కేంద్రం(మహిళ ప్రాంగణం)లో బ్యూటీషియన్, నర్సు ట్రైనింగ్, కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా మేనేజరు పర్హాన గురువారం తెలిపారు. 18-35 మధ్య వయస్సు కలిగి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలకు బ్యూటీషియన్, నర్సు ట్రైనింగ్, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన మహిళలకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (కంప్యూటర్ కోర్సు) కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన మహిళలు అర్హులని, దీనికి సంబంధించి మరిన్ని వివరాలకు 8019291762ను సంప్రదించాలని కోరారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి

టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. అలిపిరి పాదాల చెంత మహావిష్ణువు విగ్రహం విషయమై టీటీడీ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విషయాన్ని చెబితే తానేదో మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నట్లుగా చిత్రీకరించి అవాస్తవ కేసులు పెట్టి నోటీసులు జారీ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు.

ప్రపంచ శాంతికి ప్రకృతిని కాపాడాలి

- ధ్యాన మహాయజ్ఞంలో వక్తలు



రాఘవరావు, పద్మా దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం ప్రకృతిని కాపాడాలని వక్తలు కోరారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ధ్యాన మహాయజ్ఞంలో మూడో రోజైన గురువారం యజ్ఞ కమిటీ చైర్మన్ బ్రహ్మర్షి జక్కా రాఘవరావు, పీఎంసీ ట్రస్టు చైర్మన్ దాట్ల హనుమంతరాజు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్, పీఎస్ఎస్ఎం తిరుపతి అధ్యక్షుడు కంచి రఘురామ్ మాట్లాడుతూ మన స్వార్థం కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తే అది మనల్ని ధ్వంసం చేస్తుందన్నారు. వేలాది మందితో ధ్యానం చేయడం ద్వారా ఆ ధ్యాన శక్తి తరంగాలు విశ్వవ్యాప్తంగా విస్తరించి శాంతిని నెలకొల్పుతాయని తెలిపారు. అంతకు ముందు పిరమిడ్ ఆస్థాన విద్యాంసులు వయోలిన్ గణేష్ బృందం సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం జరిగింది. అనంతరం కంచి రఘురామ్, జక్కా రాఘవరావు, పద్మా దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

మన సంస్కృతిలోనే దేశ ఔన్నత్యం



సదస్సులో ప్రసంగిస్తున్న హనుమంతరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ సంప్రదాయాల్లోనే దేశ ఔన్నత్యం ఇమిడి ఉందని వివేకానంద కేంద్ర అఖిల భారత ఉపాధ్యక్షుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం 'రోల్ ఆఫ్ కల్చర్ ఇన్ బిల్డింగ్ నేషనలిజం' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాల విషయంలో మనదేశం ప్రపంచానికే మార్గదర్శకమైందన్నారు. ఈ విషయాన్ని స్వామి వివేకానంద ఏనాడో చాటి చెప్పారని గుర్తు చేశారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్ మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణ బాధ్యత యువతరంపైనే ఉందన్నారు. కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ విదేశీ సంస్కృతిని విడనాడి, మన సంస్కృతిని ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర ప్రతినిధులు రవినాయుడు, చెరుకూరి ప్రసాద్, ఉదయ్‌కుమార్, రాజశేఖర్, శరత్‌బాబు పాల్గొన్నారు.

22 నుంచి ముక్కంటి ఆలయంలో
నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవీ నవరాత్రులలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రోజు కొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22న కలశ స్థాపన, అమ్మవారి స్థల నిర్ణయం, శైలపుత్రి అలంకారం, 23న మహావిష్ణు ఉత్సవం, బ్రహ్మచారిణిదేవి అలంకరణ, 24న తపస్సు ఉత్సవం, చంద్ర ఘంటాదేవి అలంకారం, 25న కూష్మాండదేవి అలంకారం, 26న అశ్వాసుర వధ ఉత్సవం, స్కంధమాతదేవి అలంకారం, 27న వ్యాఘ్రాసుర వధ ఉత్సవం, కాత్యాయని దేవి అలంకారం, 28న రక్తబీజాక్షరి ఉత్సవం, శ్రీకాళరాత్రిదేవి అలంకారం, 29న బండాసుర వధ ఉత్సవం, మహాగౌరిదేవి అలంకారం, 30న మహర్నవమి ఉత్సవం, మహిషాసుర మర్ధిని అలంకరణ, 1న పార్వేట ఉత్సవం, విజయదశమి నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10 లక్షల విరాళం

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. విజయనగరానికి చెందిన కృష్ణ హరీశ్ ఈశ్వర విరాళం డీడీని తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.2.86 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,410




అలిపిరి చెక్‌పాయింట్ వద్ద లైటింగ్ సెట్




శ్రీవారి ఆలయానికి లైటింగ్

బ్రహ్మోత్సవాలకు తొలి వెలుగులు



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే తిరుమలలో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును గురువారం రాత్రి పరిశీలించారు. శ్రీవారి ఆలయ గోపురం, ప్రాకారం, ధ్వజస్తంభం, వెండివాకిలి, మహద్వారం వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లతో పాటు తిరుమలలోని పలు ప్రదేశాల్లో అమర్చిన కటౌట్లు, తోరణాల లైట్లను వెలిగించారు. గుర్తించిన లోటుపాట్లను సవరించారు. మరోసారి శుక్రవారం ఈ విద్యుత్ అలంకరణలను పరిశీలించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి










రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు


చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బారులు తీరిన బస్సులు

బస్సులు బయలుదేరే సమయంలో
'అమరావతి' ప్రయాణం రద్దు

వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు ● 1506 మంది రిజిస్ట్రేషన్.. వారి సహాయకులూ రాక ● భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాసేపట్లో బస్సులు బయలుదేరతాయనగా డీఎస్సీ అభ్యర్థుల అమరావతి ప్రయాణం రద్దయింది. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టిన మైదానం వర్షం నీటితో నిండిపోవడంతో రద్దుచేసినట్టు అధికారులు ప్రకటించారు. దీంతో వీరంతా తిరుపతి నుంచి వెనుదిరిగారు. ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు అమరావతిలో శుక్రవారం నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టారు. దీనికిగాను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన 1408 మంది, జోనల్ అభ్యర్థులు 124 మంది కలిపి 1532 మంది.. వారి సహాయకులను కలిపి మొత్తం 3064 మందిని అమరావతికి తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 86 బస్సులను కేటాయించారు. అందరినీ తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం ఉదయం 7 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించి 10.30 గంటలకు ముగించారు. మొత్తం 1532 మందికిగాను 1506 మంది ప్రయాణానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 26 మంది రాలేక అధికారుల అనుమతి తీసుకున్నారు. అభ్యర్థులు, వారి సహాయకులు 3,012 మందితో ఆ ప్రాంగణం రద్దీగా మారింది. ఓవక్క బారులు తీరిన బస్సులు, మరోవక్క వేలాదిమంది అభ్యర్థులు, వారి సహాయకులతో సందడి వాతావరణం నెలకొంది. అల్పాహార పంపిణీ తర్వాత 10.45 గంటల సమయంలో బస్సులు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. ఆ సమయలోట కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు, తదుపరి కార్యక్రమ తేదీని మళ్లీ ప్రకటిస్తామని అమరావతి నుంచి అధికారులకు సమాచారం వచ్చింది. భారీ వర్షంతో అమరావతిలోని సభా ప్రాంగణంలో నీళ్లు చేరడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. కాగా, దారి మధ్యలో 1600 మందికి గూడూరులో, మరో 1600 మందికి నెల్లూరులో భోజన ఏర్పాట్లు చేశారు. ప్రయాణం రద్దుకావడంతో ఆహార పదార్థాలు వృథాగా మారాయి.




కార్యక్రమం రద్దవడంతో వెనుదిరిగిన అభ్యర్థులు,సహాయకులు - చిన్నారితో వచ్చిన డీఎస్సీ అభ్యర్థి

తిరుమలకు తగ్గిన బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏడు డిపోల నుంచి సప్తగిరి బస్సులను ఎంపిక చేశారు. వీటిలో చాలా వరకు తిరుమలకు వెళ్లే బస్సులే. గురువారం ఉదయం 7 గంటలకే ఈ బస్సులు చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరాయి. ప్రయాణం రద్దయిందని తెలిసి తిరిగి ఆయా డిపోలకు బస్సులు చేరాయి. మెయింటనెన్స్ చేసుకొని మళ్లీ రోడ్డెక్కే సరికి సాయంత్రమైంది. ఈ మధ్యలో తిరుమలకు బస్సుల ట్రిప్పులు తగ్గాయి.

అన్నప్రసాద ట్రస్టు కార్పస్ నిధులు
బాగా పెరిగాయ్ : టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం నాణ్యత, రుచులపై ప్రపంచవ్యాప్తంగా భక్తుల నుంచి వస్తున్న స్పందన కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రస్టు కార్పస్ నిధులు చాలా బాగా పెరిగాయని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమయాలు, టోకెన్ విధానం, క్యూలైన్ సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి, తిరుమలలోని వివిధ పాయింట్ల వద్ద అన్నప్రసాదాల పంపిణీ తదతర అంశాలపై సమాచారం సేకరించారు. అలాగే వంటశాల, స్టోర్ రూమ్, జీడిపప్పు బ్లాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్నప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారిసేవలకులతో కూడా మాట్లాడారు. అన్నదాన కార్యక్రమం 1985లో ప్రారంభమై, 1994లో అన్నప్రసాదం ట్రస్టుగా ఏర్పడిందన్నారు. 2020 వరకు ఈ కార్యక్రమం నడవడానికి టీటీడీ గ్రాంట్ ఇస్తూ వచ్చిందని, ఆతర్వాత స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. ఏటా విరాళాలు పెరగుతున్నాయన్నారు. 2023-24లో కార్పస్ రూ.1,854 కోట్లు, 2024-25లో రూ.2127 కోట్లు, 2025 ఆగస్టు వరకు రూ.2,263 కోట్లకు చేరిందన్నారు. వడ్డీల రూపంలో 2024లో రూ.221 కోట్లు, 2025లో రూ.270 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుత వార్షిక వ్యయం రూ.150 కోట్లు ఉందన్నారు. రూ.కోటి విరాళదాతలు కూడా పెరిగారని, 2023-24లో 14 మంది ఉంటే, 2024-25లో 25 మంది, ఈ సంవత్సరం ఐదు నెలల్లో 14 మంది రూ.కోటికిపైగా విరాళాలు అందజేశారని వివరించారు. ప్రస్తుతం తాము వార్షిక బ్రహ్మోత్సవాలపై దృష్టిసారించామని, భక్తుల అభిప్రాయాలు, ఈ-మెయిళ్లు, డయల్ యువర్ ఈవో, వాట్సాప్, సర్వే, ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే సూచనలు వ్యవస్థలో అవసరమైన చోట సవరణలు చేయడానికి కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈతనిఖీల్లో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలోని మంగళం అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మామండూరు నుంచి కరకంబాడీ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూ గురువారం తెల్లవారుజామున మంగళం సమీపంలోని గ్రాండ్‌వరల్డ్ వెనుక వైపునకు చేరుకున్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ వారి కంటబడ్డారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి ఇద్దరిని పట్టుకున్నారు. వారు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. దుంగలతో సహా టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 రైలు సర్వీసులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 సర్వీసులు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు (07039) నాందేడ్‌లో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాయి. తిరుచానూరులో ఈనెల 24, అక్టోబరు 1 తేదీల్లో ప్రత్యేక రైలు(07040) సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు హజరత్ నాందేడ్‌కు చేరుకుంటాయి. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బ్రిక్స్ స్కిల్ టెక్నాలజీలో కాంస్య పతకం
బ్రెజిల్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రెజిల్‌లో నిర్వహించిన బ్రిక్స్ స్కిల్స్ డెవెలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపిటేషన్‌లో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకాన్ని సాధించారు. ఫుడ్ ప్యాకేజింగ్‌లో బయో ప్యాక్ వ్యవస్థపై ఆమె ప్రదర్శన ఇచ్చారు. కాంస్య పతకాన్ని పొందారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డైరెక్టర్ మల్లికార్జున అభినందించారు.



రమాజ్యోతిని అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ
ఆర్ అండ్ డీ కాన్‌క్లేవ్‌లో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి



ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ 2వ ఎడిషన్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డి కాన్‌క్లేవ్ స్థానిక ఓ హోటల్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అత్యాధునిక ఉత్పత్తులను అందించేలా పనిచేయాలని యువతకు సూచించారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్ కాటంనేని వర్చువల్‌గా మాట్లాడారు. వ్యవస్థాపకతను పెంపొందించడం, 20వేల స్టార్టప్‌లను సృష్టించడం, రాబోయే ఐదు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీని ప్రారంభించిందని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ గత చైర్మన్ డి.రామకృష్ణ, పుష్పిత్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పుష్పిత్ గార్గ్, విప్రో లిమిటెడ్ ఏఐ గ్లోబల్ డెలివరీ హెడ్ రఘువీరన్, క్యాప్ జెమిని ఇన్వెంట్ సీనియర్ డైరెక్టర్, ఇంటెలిజెంట్ ఇండస్ట్రీస్ మురళి చంద్రహాసన్ పారిశ్రామికవేత్తలు మలార్‌విలి, విజయ్‌కర్ల, వికాస్ నరహరి, డి.దామోదర్‌నాయుడు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డీజీఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజరు చేతననంద్ సింగ్ శనివారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటించ నున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. శుక్రవారం 17652 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శనివారం ఉదయం 3.55 గంటలకు తిరుపతి చేరుకుని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారు. 9.15 గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకుని 22158 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 14.10 గంటలకు గుంతకల్లు చేరుకుని సీనియర్ స్కేల్ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారు.



స్క్రాబ్ శిల్పానికి.. విగ్రహానికి
తేడా తెలియని భూమన
టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శ

తిరుపతి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి మహావిష్ణువు విగ్రహానికి, స్క్రాబ్ శిల్పానికి తేడా తెలియడంలేదని, ఆయనకు నిజంగా హిందూ ధర్మంపై నమ్మకం ఉంటే దాన్ని ఇంట్లో పెట్టుకోవాలని టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ వ్యాఖ్యానించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'స్క్రాబ్ శిల్పానికి ఇంట్లో నిత్యకైంకర్యాలు చేయాలి. సంప్రదాయాలు, ఆచారాలతో భూమన వ్యాపారం చేశారు. కార్పొరేట్ దళారులను పెంచి పోషించింది ఆయనే. ఆయన హయాంలో అర్చనానంతర దర్శనం (ఏఏడీ) టికెట్లు విక్రయించి కోట్లు సంపాదించారు. కల్యాణోత్సవం పేరుతో కమీషన్లు నొక్కారు. దేవుడి నగలతో ఎగ్జిబిషన్ పెట్టాలన్న దుర్బుద్ధి ఆయనకే సాధ్యం. కేవలం రాజకీయ లబ్ధికోసం టీటీడీని వాడుకుంటున్నాడు. జగన్ ప్రోద్భలంతోనే టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నాడు. ఆయన బూటకపు మాటలను ప్రజలు నమ్మరు. వెంకటేశ్వర స్వామితో ఆటలాడినవారందరూ తగిన మూల్యం చెల్లించుకున్నారు' అని దుయ్యబట్టారు.

బ్రహ్మోత్సవాలకు ముందు అలజడికి భూమన అజెండా
టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు అలజడి సృష్టించడానికి భూమన కరుణాకరరెడ్డి రహస్య అజెండాతో ఉన్నారనే అనుమానం కలుగుతోందని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీవారి ఆలయం ముందు గురువారం మీడియాతో మాట్లాడుతూ, అలిపిరి విగ్రహం ప్రచారంపై 41 నోటీసు ఇస్తే, 23న వస్తానని చెప్పడం వెనుక ఏదో ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. 'శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు 24న సీఎం చంద్రబాబు తిరుమలకు రాబోతున్నారు. ఆ ముందురోజు వస్తానని పోలీసులకు చెప్పడం వెనుక రహస్య అజెండా ఉండచ్చు' అన్నారు. కరుణాకరరెడ్డి వంటి వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భక్తుల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆయనకు ఎలా బుద్ధి చెప్పాలో టీటీడీకి తెలుసన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. కమిటీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఈనెల 23న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, మురళి, వెంకటరమణ, రమేష్, శాంతివర్ధన్, పద్మమ్మ, నారాయణమ్మ, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం



గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. భారతదేశాన్ని అగ్రదేశంగా నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పనబాక కోటేశ్వరరావు, నరేంద్రరెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి డాక్టర్ లక్ష్మీనారాయణ, మౌలాలి, బిందురెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు ప్రారంభం



వివిధ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులు

గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర, డీఆర్‌డబ్ల్యు కళాశాలలో గురువారం మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ఉత్సహంగా సాగాయి. అండర్-14, 17 విభాగాల్లోని బాలికలకు షటిల్ బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో భారతి, భాస్కర్, సుబ్రమణ్యం, కరిముల్లా, రమేష్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **డక్కిలి:** స్థానిక గురుకుల కళాశాల మైదానంలో క్రీడాపోటీలను మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు ప్రారంభించారు. . విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, ఎంపీపీ గోను రాజశేఖర్, ఎస్ఎంఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎస్ఎంఎస్ చైర్మన్ రత్నయ్య, హైస్కూలు హెచ్ఎం గీత, ఎంఈవో జగదీష్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను పరిరక్షించాలి



గూడూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో సీలింగ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 13వేల ఎకరాలకు పైగా సీలింగ్ ఆక్రమించుకుని రియల్‌ఎస్టేట్ చేస్తున్నారన్నారు.రామకృష్ణ, చంద్రశేఖర్, వేమయ్య, సుబ్బరామరాజు, సుబ్బారావు, శంకరయ్య పాల్గొన్నారు.

పగలు ఎండ.. సాయంత్రం వాన



వర్షంలో ఇళ్లకు చేరుకుంటున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజులుగా విభిన్న వాతావరణం చోటుచేసుకుంటున్నది. పగలంతా సూర్యుడి సెగలతో అల్లాడిపోతున్న ప్రజలను సాయంత్రానికి వాన పకలరిస్తోంది. రాత్రి వేళల్లో ఉక్కపోత తప్పడం లేదు. గురువారం పట్టణంతో పాటు చుట్టు ప్రకలా గ్రామాల్లో ఉదయం నుంచే భానుడు భగభగమంటూ మధ్నాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాసింది. సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు తేలికపాటు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టండి



వివరాలు తెలుసుకుంటున్న సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలను చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం అరబిందో కర్మాగారంలో అగ్ని ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఆయన సంఘటనాస్థలికి చేరుకున్నారు. పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట నాయకులు విజయకుమార్‌నాయుడు,ప్రభాకర్‌నాయుడు, పురుషోత్తంరాజు ఉన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి శ్రేయస్కరం



మాట్లాడుతున్న సంషాద్ బేగం

డక్కిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం శ్రేయస్కరంగా ఉంటుందని వెంకటగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి సంషాద్ బేగం అన్నారు. నాయుడుపాళెంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి బిందుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో పోషకాహర కార్యక్రమం జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో బాలికలకు పోషక ఆహారం, బాల్య వివాహాలుపై అవగాహన కల్పించారు. వల్లిపేడు వైద్యాధికారి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ కృష్ణమ్మల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పూజా సామగ్రి, నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణసేవాసంఘ కార్యాలయంలో గురువారం బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పేద బ్రాహ్మణులకు పూజా సామగ్రి, నిత్యావసరాలు పంపిణీ చేశారు. శిరోమణిశర్మ, ఆనిమేళ్ల శివకుమార్, రామ్మూర్తి, శ్రీనివాసరావు, లలితమ్మ, నరసింహరావు, సుబ్బారావు, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కల్గిఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా కలిసి జీవించాలన్నారు. సుఖ వ్యాధులు, చికిత్స, ఎయిడ్స్ చట్టం గురించితెలుసుకోవాలన్నారు. సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబరు(1097)కు ఫోన్ చేసి తెలుసుకోవాన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ నిర్వహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

తడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాటల పోటీలు నిర్వహించారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సూళ్లూరుపేట జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హైస్కూల్, ప్రాథమిక స్థాయిలో పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి ఈ నెల 20న బహుమతి ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు చెంగయ్య, శ్రీధర్‌బాబు, సుధాకర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన



స్వస్థ్‌నారీ-సశక్త్ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బల్లవోలులో గురువారం స్వస్థ్‌నారీ-సశక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి, బాల్యవివాహాలు, టీబీ, మద్యపానం వంటి వాటిని నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పాటు దీర్ఘకాలిక వ్యాధుల బాధితుల వివరాలను పంపితే ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఏడుకొండలు, టీడీపీ నాయకుడు వినయ్‌కుమార్, హజరత్తయ్య, మమత, ప్రవళిక, జయలక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి కేసులో తొలగని సందేహాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో బాలుడు లోకేష్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బాలుడు మృతదేహానికి బుధవారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం పోలీసుల అనుమానాలు బలపడటంతో అనుమానాస్పద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి నోటి నుంచి నురుగలు వచ్చి ఇంటి వద్ద విగతజీవిగా పడిఉండటంతో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

నీటివనరుల గణనపై అవగాహన



నీటి వనరులను పరిశీలిస్తున్న తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్

వాకాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొండూరులో జరుగుతున్న ఏడో మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ పనితీరును తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను గుర్తించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న నీటి వనరుల గణనపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నీటి పారుదల సామర్థ్యం, యాజమాన్యం, భూమి పరిమాణం, నీటిని ఎత్తడానికి ఉపయోగించే పరికరాలు, పంపిణీకి ఉపయోగించే పద్ధతుల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, వీఆర్వో హరిబాబు, తదితరులు ఉన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్లలో ఇటీవల కొత్తగా వచ్చిన మార్పులను నిరసిస్తూ గురువారం డాక్యుమెంట్ రైటర్లు కోటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌లలో ఓటీపీ, ఆటో మ్యుటేషన్ పద్ధతుల వల్ల తమకు ఇబ్బందుల కలుగుతున్నాయంటూ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో శుక్ర,శనివారాలో పెన్‌డౌన్ చేస్తామన్నారు. ఆందోళన తీవ్రతరం చేస్తామని వీరు హెచ్చరించారు. అనంతరం విధులను బహిష్కరించారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు దుకాణాలు



ఆటోలో మద్యం సీసాల తరలింపు



నిండలిలో బెల్టు షాపులపై గ్రామస్తుల ఆందోళన(ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు పెరిగిపోయాయి. దూరాన ఉన్న ప్రభుత్వ మద్యం షాపులకు వెళ్లకుండా తమ చెంతనే ఉన్న బెల్టు షాపులకు క్యూ కడుతున్నారు. డబ్బులెక్కుమైనా లెక్కచేయడంలేదు. దీనికితోడు ఇవీ సమయంతో సంబంధంలేకుండా ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి. వీటిని అరికట్టాల్సిన ఎక్సయిజ్ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జయంపు, బాలాయపల్లి, మేలూరు, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో వైన్ షాపులు ఉన్నాయి. అయినా సమీప గ్రామాల్లో బెల్టు షాపులున్నాయి. వీటిని షాపుల యజమానులే సిండికేటుగా ఏర్పాటై ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు రాకుండా తామే చూసుకుంటామని నిర్వాహకులకు వీరు భరోసా కల్పిస్తున్నారని తెలిసింది. షాపు యజమానులను బేఖాతరు చేసి బెల్టు షాపు నిర్వహిస్తే మాత్రం పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు న్నాయి. నిండలి, కడగుంట, మన్నూరు, అంబలపూడి, వెంకటరెడ్డిపల్లి, మన్నూరు, కాలగంద, పిగిలాం, పల్లిపాడు, మల్లెమాల, గాజులపల్లి , గొట్టికాడు, హస్తకావేరి తదితర గ్రామాల్లో ఐదు ఆరు చొప్పున బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఒక్కో సీసీపై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వేసుకుని అమ్ముతున్నారని మద్యంప్రియులు చెబుతున్నారు. బెల్టు షాపులను తొలగించాలని ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సమావేశంలో కూడా ఎంపీపీ వీటి ఏర్పాటుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తే వైన్ షాపులకు మొదట జరిమానా విధిస్తామని, మళ్లీ మళ్లీ పట్టుబడితే లైసెన్స్ లు రద్దు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనులు ఈ మండలంలో అమలుకావడంలేదు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఉరుకుందమ్మ తదితరులు

నాయుడుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటితరహాలోనే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన పట్టణం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి సీఎస్ తేజ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే దృష్ట్యా చెత్తాచెదారాలను పొడిచెత్త, తడిచెత్తగా మున్సిపాలిటీ కార్మికులకు వేయాలన్నారు. మండల పరిషత్, విద్యావనరుల, పశువైద్యశాల, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించారు. విన్నమాల పంటకాలువలోని పూడికతీత చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, లక్ష్మీ, శ్రీలక్ష్మి, ఆర్ఐ ఖాశీమ్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతల అన్నదానం

వెంకటగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి మోదీ జన్మదినం సందర్భంగా వెంకటగిరిలో పేదలకు అన్న దానం నిర్విహించారు. పార్టీ నాయకురాలు దేవిక చౌదరి ఆధ్వర్యంల్లో పోలేరమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్ని విదాల అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని లాలా కాంప్లెక్స్‌లో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సహచరుడు సాలూరి చంద్ర స్మారకార్థం టైలర్లు అన్నదానం చేశారు.

వృద్ధాశ్రమానికి వితరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంజాయ్‌గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గంగాబత్తిన రామకృష్ణ దంపతులు రూ.5వేల నగదు, నిత్యావసర సరకులకు గురువారం అందజేశారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడుకు చెందిన తమ మనుమడు పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆదరిస్తున్న ఆశ్రమం నిర్వాహకులు సునీత బెన్నీలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భార్గవ్, కీర్తిప్రియ, సుజాతమ్మ, గురునాథం తదితరులు ఉన్నారు.

సమ్మెకాలపు జీతాలు చెల్లించాలి : సీఐటీయూ



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నాయుడుపేట, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మెకాలపు జీతాలు చెల్లించాలని సీఐటీయు మండల కార్యదర్శి శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కార్మికులు, సీఐటీయు నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమానపనికి సమానవేతనం అందించాలని ఆయన కోరారు. మృతి చెందిన, ఉద్యోగ విరమణచేసిన మున్సిపల్ కార్మికుల కుటుంబంలోని ఒకరికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు సేఫ్టీ పరికరాలు, రైన్ కోట్‌లు, యూనిఫాంలు ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలపడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, కాలేషా, సురేష్, రమణమ్మ, శ్యామలమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.37.98 లక్షలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.37,98,411 లభించింది. దీంతోపాటు బంగారం రూ.20 గ్రాముల 850 మిల్లీ గ్రాములు, వెండి 312 గ్రాముల 200ల మిల్లీ గ్రాములు వచ్చింది. ఆలయ ఆవరణలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. 90 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో ఎ.జయకుమార్ తెలిపారు. పాలకమండలి అధ్యక్షుడు మహేష్ యాదవ్, సభ్యులు పర్యవేక్షించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కుస్తీ పోటీల ప్రారంభం



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, రఫీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో గురువారం జిల్లాస్థాయి కుస్తీ పోటీలపు ప్రారంభమయ్యాయి. పోటీలను రెజ్లింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కోచ్ ఉదయ్‌లు ప్రారంభించారు. అండర్-19 విభాగంలో దాదాపు జిల్లా నుంచి 150 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పసల గంగాప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు వేణుగోపాల్, బాలసుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, పి. రమణయ్య, జోజో కోచ్ వి.గోపీ, లోకేష్, ప్రసాద్, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో వసతిపై సమీక్ష

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గదుల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి రిసెప్షన్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆయన సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి రిసెప్షన్ విభాగంతో సమీక్షించారు. విశ్రాంతి గృహాలను పరిశీలించి ఏవైనా మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, ఏఎస్డీ సత్రేనాయక్, వీఎస్వో సురేంద్ర పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వతంత్రపురంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాన్ని గురువారం మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కొందరు కుల సంఘం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఆలయ నిర్మాణం చేపడుతుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి పోలీసులతో వెళ్లి నిర్మాణాన్ని కూల్చివేశారు.

ఐహెచ్‌ఆర్ఏసీ మైనారిటీ సెల్ నూతన కార్యవర్గం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ హ్యూమన్‌రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ మైనారిటీ విభాగం రాష్ట్ర నూతన కార్యవర్గం గురువారం ఎంపికైంది. స్థానిక కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు కాణిపాకం మురళి ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్‌రఫీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్‌లను నియమించారు. నూతన కమిటీ మానవ హక్కుల గురించి తెలుసుకుని, ప్రజలకు అవగాహన కల్పించాలని మురళి సూచించారు. తమపై నమ్మకంతో పదవులు అప్పగించిన మురళికి నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కంకణాల వినోద్‌కుమార్, నగర ప్రెసిడెంట్ దేవీప్రసాద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్‌గేమ్ ఫెడరేషన్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-14, అండర్-17 బాలుర ఖోఖో, త్రోబాల్, డిస్‌త్రో పోటీలు జరిగాయి. క్రీడల్లో పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పలు క్రీడల్లో ప్రతిభను కనబరిచారు. ప్రథమస్థానంలో నిలిచారు. చివరిలో కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులాల క్రీడాకారులు ఖోఖో క్రీడలో హోరాహోరీగా ఆడారు. ఎంఈవో మస్తానయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు వల్లీ, సంధాని, కృష్ణల పర్యవేక్షణలో క్రీడాపోటీలు ఉత్సాహ వాతావరణంలో సాగాయి.

కోట ప్రాంతంలో కుండపోత



గూడలి వద్ద కూలిన వేప చెట్టు

కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోట, విద్యానగర్‌లలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో సుమారు 40 నిమిషాలపాటు వర్షం కురవడంతో గూడలి, రుద్రవరం, రాజుపాళెం గ్రామాల్లో పలుచెట్లు కూలిపోయాయి. విద్యానగర్‌లో వీధుల్లో వర్షపునీరు నిల్వచేరింది. **పెళ్లకూరు:** వేసవిని తలపిస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు గురువారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. జీలపాటూరు, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, ఏపీఎస్ నగర్, వడ్డిపాలెం తదితర గ్రామాల్లో మధ్యాహ్నం వరకు ఎండలతో అల్లాడిపోయారు. తర్వాత వాతావరణం మారి వర్షం పడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. పచ్చిరొట్ట విత్తనాలకు ఈ వర్షం ఊపిరిపోస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇటు చిరుజల్లు..అటు హరివిల్లు

ఉదయం నుంచి భానుడు ప్రతాపం చాటుకున్నాడు. మధ్యాహ్నం తీవ్రత తగ్గింది. ఇంతలోనే ఆకాశాన మబ్బులు అలముకున్నాయి. కాస్సేపటికి చిరుజల్లులు కురిశాయి. ఎండ కాస్తుండగానే జల్లులు కురుస్తుండటంతో ఆకాశాన ఇంద్రధనస్సు విరిసి ఆహ్లాదం పంచింది. చిల్లకూరు- వడ్డిపాలెం జాతీయ రహదారిపై ఈ మనోహర దృశ్యం కనువిందు చేసింది.

-పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

ప్రపంచ శాంతికి ప్రకృతిని కాపాడాలి



రాఘవరావు, పద్మా దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం ప్రకృతిని కాపాడాలని వక్తలు కోరారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ధ్యాన మహాయజ్ఞంలో మూడో రోజైన గురువారం యజ్ఞ కమిటీ చైర్మన్ బ్రహ్మర్షి జక్కా రాఘవరావు, పీఎంసీ ట్రస్టు చైర్మన్ దాట్ల హనుమంతరాజు, సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్, పీఎస్ఎస్ఎం తిరుపతి అధ్యక్షుడు కంచి రఘురామ్ మాట్లాడుతూ మన స్వార్థం కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తే అది మనల్ని ధ్వంసం చేస్తుందన్నారు. వేలాది మందితో ధ్యానం చేయడం ద్వారా ఆ ధ్యాన శక్తి తరంగాలు విశ్వవ్యాప్తంగా విస్తరించి శాంతిని నెలకొల్పుతాయని తెలిపారు. అంతకు ముందు పిరమిడ్ ఆస్థాన విద్వాంసులు వయోలిన్ గణేష్ బృందం సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం జరిగింది. అనంతరం కంచి రఘురామ్, జక్కా రాఘవరావు, పద్మా దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి కృషి : నారా లోకేశ్


మంత్రి నారా లోకేశ్‌కు ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం ఆలయ అభి వృద్ధికి కృషిచేస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. గురువారం అసెంబ్లీ విరామ సమయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఏర్పేడు మండలంలో గల గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ చరిత్ర బుక్‌లెట్‌ను అందజేశారు.

వంద వసంతాల వేడుక నిర్వహణపై సమావేశం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజా పానుగంగి బంగారమ్మ సీతారామనాయనింగారి జడ్పీ ఉన్నత పాఠ శాల వంద వసంతాల వేడుకలపై గురువారం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య అధ్యక్షతన పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటయ్య మాట్లాడుతూ 1921లో స్థాపించిన పాఠశాల వంద వసంతాల వార్షికోత్సవాన్ని కరోనాకారణంగా 2021లో నిర్వహించలేకపోయినట్లు తెలిపారు. త్వరలోనే వేడుక తేదీని ప్రకటిస్తామని వివరించారు. పూర్వవిద్యార్థులు గోపాలకృష్ణ, చిట్టిబాబు, పురుషోత్తంరెడ్డి, కుమార్, మోహన్, నిరంజన్, త్రిమూర్తి, కేశవ, లింకన్, రంగయ్య, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి


డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అధ్యక్షుడు జొన్నలగడ్డ మురళి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆర్టీసీ గ్యారేజీ ఆవరణంలో ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శుక్రవారం కూడా నిరసన ప్రదర్శన చేపడతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ మణ్యం, బీకే రెడ్డి, ఆనంద్, జగన్నాథం, నాగరాజు, మునీర్ కేఎస్ఆర్ కృష్ణ, గ్యారేజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడాపోటీలు

కేవీబీపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పది ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరె, కేవీబీపురం పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో రవికుమార్ తెలిపారు.

పీఈటీ సావిత్రికి యూటీఫ్ సన్మానం



కేవీబీపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న సతీసావిత్రి ఇటీవల ఉత్తమ పీఈటీగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న విషయం తెలిసిందే. ఆమెను గురువారం కేజీబీవీ పాఠశాలలో మండల యూటీఎఫ్ నాయకులు ఘనంగా పూలమాలలు వేసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శి హేమబందర రావు, మునెయ్య, పురుషోత్తం, ధర్మరాజురెడ్డి, శ్రీదేవి, రవికుమార్, సీఆర్పీ సూపర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో భారీ వర్షం


శ్రీరామ్‌నగర్‌కాలనీలోని తిరుపతిరోడ్డుపై కురుస్తున్న వర్షం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 నుంచి గంటన్నర పాటు కుండపోత వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో హోరు వాన కురవడంతో లోతట్టు వీధులు, రోడ్లు జలమయమయ్యాయి.

మొరాయించిన పోలీసు వాహనం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంక్చర్ కావడంతో పోలీసు వాహనం మొరాయించింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ అధికారులు ఉపయోగించే వాహనం పట్టణ శివారు మినీ బైపాస్ సమీపంలోని తొట్టంబేడు గ్రామానికి వెళ్లే రహదారిపై బుధవారం సాయంత్రం పంక్చరైంది. రోడ్డుపై మొరాయించింది.

జనసురక్ష, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో జనసురక్ష, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న ప్రధానమంత్రి జీవన సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజరు ఆఫ్ ఇండియా రాజేష్‌కుమార్, ఎల్డీఎం రవికుమార్, రీజనల్ మేనేజరు రత్నబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సహకార సంఘం చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన భీమాల భాస్కర్ ముదిరాజ్‌ను గురువారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేట బాలాజీరెడ్డి, ఎంఎస్ రెడ్డి, రామువులుయాదవ్, మునెయ్య, బాలసుబ్రహ్మణ్యం,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇనగలూరులో స్వస్తి నారి స్వస్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత నివారణపై వైద్యాధికారి సుధీర్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య రాదన్నారు. ఈ కార్యక్రమంలో చెలికం పాపిరెడివ్వ, శివారెడివ్వ, సుబ్బయ్య, రామయ్య, నాగరాజు, ఈశ్వరరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో యాచకుడి మృతి



శ్రీకాళహస్తి,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని భక్తకన్నప్ప వంతెనపై బుధవారం ఉదయం ఓ యాచకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. 1టౌన్ పోలీసులు అతడి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

పిచ్చాటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌తో మహిళలకు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి మునిచరిత తెలిపారు. గురువారం మండలంలోని వెంగళత్తూరు అంగన్వాడీ కేంద్రంలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు వైద్యాధికారులు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు బజావతి, సుమతి, సీహెచ్‌వో శివయ్య, డాక్టర్ ధనంజయలు, ఎంఎస్‌కే నిత్య, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వీధికుక్కలకు వైద్యం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యాధి సోకిన వీధికుక్కలకు వెటర్నరీ సిబ్బంది వైద్యం అందించారు. 'వీధికుక్కలకు వింత వ్యాధులు' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై శ్రీకాళహస్తి వెటర్నరీ ఏడీ గోవిందరాజులు స్పందించారు. పట్టణంలోని హరహరబావివీధి, కొత్తపేట, రామసేతు వంతెన ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధికుక్కలను పరిశీలించారు. గాయాలు, చర్మవ్యాధులతో తిరుగుతున్న పలు కుక్కలకు వైద్యం అందించారు.

స్వర్ణశోభితం..వేదనారాయణుడి రాజగోపురం



నాగలాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వేదవల్లి సమేత వేద నారాయణ స్వామి ఆలయ రాజగోపురం గురువారం సాయంత్రం సూర్యకిరణాల వెలుగులో బంగారువర్ణంలో మెరిసిపోయింది. అదే సమయంలో ఆలయ గోపురంపై ఏర్పడిన ఇంద్ర ధనుస్సు భక్తులను పులకరింపజేసింది. సాయంత్రం వర్షం కురిసి తగ్గిన తర్వాత సాయంత్రపు భానుడి కిరణాలు ఆలయ రాజగోపురంపై పడడంతో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సుందర దృశ్యాన్ని చూడటానికి ప్రజలు సన్నిధి వీధిలోని టవర్‌క్లాక్ కూడలిలో కిక్కిరిసిపోయారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి


ఎంపీడీవోకు సమస్యలు వివరిస్తున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు పంచాయతీలోని ఓటువాని గిరిజన కాలనీ వాసులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవో మోతిని కోరారు. కాటూరు గ్రామంలోని గిరిజన కాలనీలో ఉపాధి పనులపై గురువారం గిరిజనులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఇందులో పలు సమస్యలను గిరిజనులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. కాటూరు నుంచి ఓటువాని గిరిజన కాలనీకి వెళ్లే రోడ్డు వర్షాలకు గుంతలమయ మైందన్నారు. అలాగే విద్యార్థులకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. ఎంపీడీవో స్పందిస్తూ విద్యార్థులకు తక్షణం ఆధార్ కార్డులు చేయించాలని కాటూరు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఓటువాని గిరిజన కాలనీ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి బాగుచేయిస్తామని హామీ ఇచ్చారు. ఈమె వెంట ఉపాధి ఏపీవో దేవరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. స్పీడ్ బ్రేకర్లకు రంగులు మరిచారు


రేణిగుంట - తిరుపతి మార్గంలో వేసిన తారు రోడ్డు

రేణిగుంట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : నూతనంగా తారు రోడ్డు వేసి స్పీడు బ్రేకర్లకు రంగులు అద్దడం మరవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రేణిగుంట - తిరుపతి మార్గంలో ఈ పరిస్థితి నెలకొంది. నేషనల్ హైవే అధి కారులు ఈ మార్గంలో ఇటీవల నూతనంగా తారు రోడ్డు పనులు చేశారు. దీంతో స్పీడు బ్రేకర్లపైనున్న ప్రమాద సూచికల రంగులు కనపడకుండా పోయాయి. సీఆర్‌ఎస్ రైల్వే ఆస్పత్రి, పాత ఆంధ్రజ్యోతి కార్యాలయం, మూడో మైలు వద్ద రాత్రి సమయంలో ఇటువైపుగా రాకపోకలు సాగించే వాహనాలు స్పీడు బ్రేకర్లు కనబడక ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులకు స్థానికులు పలుమార్లు విన్నవించినా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రగులు వేయించాలని కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి భరత్ కుమార్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌మార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే ట్యూషన్ ఏర్పాటు చేయాలని వార్డెన్ రామయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ సంచాలకులు మునీంద్రయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటుగా శారీరక ధృడత్వం కలుగుతుందని ప్రధానోపాధ్యాయరాలు గాయిత్రి తెలిపారు. మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడల నిర్వహణలో భాగంగా మండల స్థాయిలో షాట్‌పుట్, లాంగ్‌జంప్ డిస్కస్‌త్రో, రన్నింగ్ తదితర పోటీలను వైస్‌ఎంపీపీ మునికృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ పోటీలలో నెలవాయి, కల్లివెట్టు, చల్లమాంబపురం, బుచ్చినాయుడు కండ్రిగ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రతిభచూపిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీలు వినోద్, మస్తాన్, హరిబాబు, మురళీమోహన్, దాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు


మాట్లాడుతున్న అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి

నాగలాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నాగలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ కిషోర్ అన్నారు. ఇందులో భాగంగా గురువారం నాగలాపురం మండలంలోని వినోభానగర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. హిమోగ్లోబిన్, షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించారు. రొమ్ము గర్భాశయ, నోటి క్యాన్సర్ లక్షణాలు, నివారణ తదితర అంశాలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు మౌనిక, రమాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పంపిణీ



ఏర్పేడు: పెరటికోళ్లను పెంచడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏర్పేడు టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు అన్నారు. పీడీఎఫ్‌ఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పేడు, పాపానాయుడుపేటలో వంద యూనిట్ల పెరటికోళ్లను మహిళలకు గురువారం పంపిణీ చేశారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

సత్యవేడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పిం చాలని పేరడం గిరిజన కాలనీ వాసులు సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాల నీలో సుమారు 30 గిరిజన కుటుంబాల వారు నివసిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేదన్నారు. అటవీ సమీపంలోనే కాలనీ ఉండడంతో రాత్రిళ్లు పాములు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాణభయంతో జీవిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో అధికారులను సంప్రదిస్తే రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌వోసీలు తీసుకు రావాలని చెబుతున్నారని వాపోయారు. ఇదివరకు పలుమార్లు వినతులు సమర్పించినా అధికారులు స్పందించడంలేదని వాపోయారు. అధికారులు స్పందించి తమ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు డీటీ త్యాగరాజుకు వినతి పత్రం అందించారు.

పల్లికొండేశ్వరుడి ఆదాయం రూ.6,61,802


హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

నాగలాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 6 లక్షల 61 వేల 802 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారి లత వెల్లడించారు. ఈ ఆదాయం 59 రోజులకు గాను వచ్చిన కాను కలని వివరించారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ తిరుపతి డివిజన్ తనిఖీదారులు పనిరాజు సైనా, నాగలాపురం హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామిరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

పుత్తూరు వార్తలు

భక్తిశ్రద్ధలతో పవిత్రాల సమర్పణ



స్నపనతిరుమంజనం చేస్తున్న అర్చకులు, పవిత్రాలను ఊరేగింపు గా తెస్తున్న అర్చకులు

వడమాలపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ గావించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన చేపట్టారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లకు, జయ విజయులకు, గరుడాళ్వార్‌కు, ఆంజనేయస్వామివారికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్రాల సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు, ఆలయం అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

అంతరిక్ష విజయాలు యువతకు ప్రేరణ

పుత్తూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): భారత దేశ అంతరిక్ష పరిశోధనలు, సాధించిన విజయాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని భారత అంతరిక్ష విప్లవ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్‌బాబు, మన్యం నరసింహులు, సుజల, స్వప్నస్మితలు పాల్గొన్నారు.

సదాశివకోన మాజీ చైర్మన్‌కు రోజా నివాళి



పుత్తూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): సదాశివకోన మాజీ చైర్మన్ సదాశివరెడ్డి సంస్మరణ సభలో మాజీ మంత్రి రోజా పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. పుత్తూరు మండలం పైడిపల్లి గ్రామంలో గురువారం ఆయన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను రోజా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, బత్తెయ్య పాల్గొన్నారు.